క్లుప్తంగా

జాతీయ సదస్సుకు గిరిజన నాయకులు



జాతీయ గిరిజన సదస్సుకు వెళ్తున్న గిరిజన నాయకులు

సారవకోట: తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో జరుగుతున్న గిరిజన జాతీయ సదస్సుకు మండలం నుంచి పలువురు గిరిజన నాయకులు బుధవారం వెళ్లారు. జిల్లా గిరిజన ఐక్య వేదిక సంఘం ఆధ్వర్యంలో గిరిజన ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణతోపాటు మండలానికి చెందిన పలువురు గిరిజన నాయకులు తరలి వెళ్లారు.

ఘనంగా టీఎస్ గుప్త జయంతి



టీఎస్ గుప్త విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఎల్ శర్మ

నరసన్నపేట: స్వాతంత్య్ర సమరయోధుడు టంకాల శశిభూషణ గుప్త జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గోరువాని చెరువు వద్ద ఉన్న గుప్త విగ్రహానికి నరసన్నపేట పంచాయతీ వార్డు సభ్యుడు బీఎల్ శర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీసీటీ ప్రతినిధి రామారావు, గుప్త అభిమానులు తంగుడు శ్రీధర్, నాయుడు రమేష్ కుమార్, కొత్తవీధికి చెందిన పలువురు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతి



రాజారావు(ఫైల్)

పొందూరు: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి, మాజీ వైస్ ఎంపీపీ కాకర్ల రాజారావు(55) బుధవారం ఉదయం మృతి చెందారు. ఉదయం కొండ వీధిలో ఉన్న దుకాణం వద్ద ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ వ్యక్తితో స్వల్ప వివాదం చోటుచేసుకుంది. వివాదం జరుగుతుండగా ఇంటికి వెళుతున్న రాజారావు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దుకాణంలో పనిచేస్తున్న ఉద్యోగులు వెంటనే రాజారావును శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాజారావు భార్య చల్లమాంబ ప్రస్తుతం మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. రాజారావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికే కమిటీలు



మన్మధరావు

జలుమూరు: వైఎస్సార్ సీపీకి పూర్వవైభవంతోపాటు గ్రామ స్థాయిలో మరింత బలోపేతానికి బూత్ కమిటీలు దోహదపడతాయని పార్టీ బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు దామ మన్మధరావు అన్నారు. బుధవారం పాగోడులో విలేకర్లతో మాట్లాడారు. పార్టీ ఆదేశాల మేరకు మండల, గ్రామ స్థాయి కమిటీలను వేసి పార్టీని బలపర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటినుంచే వీటిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి క్షేత్ర స్థాయిలో పనిచేసే కార్యకర్తలకు అవకాశం ఇస్తామన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ విజయసాయి రెడ్డి, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన రైతులను ఆదుకోవాలి

కొత్తూరు: వర్షాలకు పంటను నష్టపోయిన గిరిజన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తుఫాన్‌కు నష్టపోయిన ఎకరా వరి పంటకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాలకు అపరాల పంటలు మరింత నష్టపోయాయన్నారు. నష్టపోయిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి, నష్ట నివేదకలు తయారుచేసి ప్రభుత్వానికి అందించాలన్నారు.

సబ్ పోస్టాఫీస్ వేళల్లో మార్పు

నరసన్నపేట: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సబ్ పోస్టాఫీస్ పని వేళలు మారినట్లు పోస్ట్‌మాస్టర్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 2 నుంచి 5 వరకు కార్యాలయం తెరిచి ఉండేదన్నారు. ఇకనుంచి ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 వరకు పనిచేస్తుందన్నారు. ఖాతాదారులు గమనించాలని కోరారు.

28న మండల సమావేశం

నరసన్నపేట: ఈ నెల 28న మండల సర్వసభ్య, బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ బి.మధుసూదనరావు బుధవారం ఒక ప్రటకనలో తెలిపారు. ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభవుతుందన్నారు. సమావేశంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్, 2024–25కి సవరణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలన్నారు.

ఏసు లోక రక్షకుడు

దేవుడి కుమారుడిగా ఈ లోకానికి విచ్చేసిన ఏసు లోక రక్షకుడని, బైబిల్ పఠనంతో శుభాలు, సుఖశాంతులు సమకూరుతాయని క్రైస్తవ మత పెద్దలు అన్నారు. పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మతాలకు అతీతంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. శాంతాక్లాజ్ వేషధారణ వేసుకున్నవారు చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టి సందడి చేశారు. ప్లాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు చర్చలకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. నిరుపేదలకు దుస్తులను పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: కృపామందిరంలో దుస్తులు పంపిణీ చేస్తున్న జిల్లా క్రైస్తవ మ్యారేజ్ రిజిస్ట్రార్ ప్రత్తిపాటి ప్రసాదరావు, తదితరులు



సరుబుజ్జిలి: తమ్మినాయుడుపేట ప్రవక్త సంఘం వద్ద క్రిస్మస్ వేడుకలు



బూర్జ: బొమ్మిక చర్చిలో దుస్తులు పంణీ చేస్తున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు



సారవకోట: ధర్మలక్ష్మీపురంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్ బంగారి ప్రేమానందం



ఎల్.ఎన్.పేట: మోదుగువలస ఆర్‌ఆర్ కాలనీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



పొందూరు: సీఎంసీ చర్చిలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు స్వీట్ తినిపిస్తున్న చిన్నారి



జలుమూరు: సీతారాంపురంలో దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్ టి.రవిబాబు



కొత్తూరు: నివగాం చర్చిలో కేక్ కట్‌చేసి వేడుకలు ప్రారంభించిన పాస్టర్ రాజు



పాతపట్నం: జేసీపీఎం చర్చిలో పాస్టర్లను సన్మానిస్తున్న క్రైస్తవులు



ఆమదాలవలస: కృష్ణాపురంలోని గ్రేస్ గాస్పల్ చర్చిలో దుస్తులు పంపిణీ చేస్తున్న సంఘ పెద్దలు



నరసన్నపేట: పైడితల్లి కూడలి వద్ద ఉన్న చర్చిలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగి మురళి



పాతపట్నం: కొరసవాడలోని ఆంధ్రా బాపిస్టు చర్చిలో నత్యం చేస్తున్న చిన్నారులు



కొత్తూరు: ఎన్.ఎన్.కాలనీలో దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్ పి.వి.రమణ



హిరమండలం: హిరమండలం చర్చిలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఫాదర్స్ జాన్సన్, స్వరాజ్

పోరుబాట విజయవంతం చేయాలి



చింతాడ రవికుమార్

ఆమదాలవలస: వైఎస్సార్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో ఆమదాలవలస నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం 'విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆమదాలవలస రైల్వే స్టేషన్ దరి వన్ వే జంక్షన్ సమీపంలోని గాంధీజీ విగ్రహం వద్ద నుంచి నిరసన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసే అన్యాయాన్ని చేరవేయడమే తమ ధ్యేయమని రవికుమార్ అన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం చేసే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

ఆమదాలవలస: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ కె.వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని అక్కులపేట గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంకల్పం పేరిట మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్ యాక్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయిని ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ అకౌంట్, ఏటీఎం పిన్ కోడ్ వివరాలను ఎవరైనా అడిగితే అటువంటి వారికి చెప్పవద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లకు వాహనాలను ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ ప్రతినిధులు

కొత్తూరు: మండల కేంద్రంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానిగా దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. దేశ ప్రజల అభివృద్ధికి, దేశ రక్షణ కోసం అమలు చేసిన పలు నిర్ణయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక రుద్రాభిషేకాలు



సామూహిక రుద్రాభిషేక పూజల్లో పాల్గొన్న ధర్మాన కృష్ణదాస్, సిద్ధాశ్రమం ప్రతినిధులు



పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్‌లోని సిద్ధాశ్రమంలో గురువారం సామూహిక రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ ఆరంగి మురళి, గుప్త, సిద్ధాశ్రమ కమిటీ ప్రతినిధులు చింతు రామారావు, తంగుడు జోగారావు, బోయిన ఆనంద్, శిమ్మ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

ముసురు.. అన్నదాతకు ఉసురు

- పది రోజుల్లో రెండు తుఫాన్లు
- ఖరీఫ్ వరి పంటకు నష్టం
- పంట పొలాల్లో నిలిచిపోయిన వర్షం నీరు
- అపరాల పంటలకూ తప్పని కష్టం

పాతపట్నం నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలో	
రెవెన్యూ గ్రామాలు:	233
మొత్తం రైతులు:	48,076 మంది
ఖరీఫ్ సాగు విస్తీర్ణం:	78,160 ఎకరాలు
పెసర, మినుము పంటల సాగు:	33,500 ఎకరాలు
మొక్క జొన్న సాగు:	21,400 ఎకరాలు
రబీలో వరిసాగు:	12,150 ఎకరాలు
ఇతర పంటల సాగు:	3,100 ఎకరాలు



మెళియాపుట్టి: శేఖరాపురంలో తడిసిన వరికుప్పలను చూపిస్తున్న రైతు



ఎల్.ఎన్.పేట:కృష్ణాపురం వద్ద నీట మునిగిన రబీ వరి పంట పొలాలు



పాతపట్నం: బూరగాం వద్ద వర్షం నీటిలో మినుము పంట

ఎల్.ఎన్.పేట: వాతావరణ పరిస్థితులకు ఎదురొడ్డి పండించిన పంటతోపాటు పంట దిగుబడులను కాపాడుకునేందుకు అకాల వర్షాల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అటు ఖరీఫ్, ఇటు రబీ రెండు సీజన్లను కలిపే సమయంలో మారిన వాతావరణ పరిస్థితులు పంటలను దెబ్బతీస్తున్నాయి. ఖరీఫ్‌లో వరిసాగు కోసం తాహతకు మించి అప్పలు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు పంట చేతికి అందివచ్చే సమయంలో వర్షాలు నష్టాన్ని మిగిల్చాయి. రబీ వరి, మొక్కజొన్నతోపాటు అపరాల పంటలైన పెసర, మినుము పంటలకు కూడా నష్టం తప్పటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్ర ఆందోళన..

బంగాళాఖాతంలో మళ్లీ ఏర్పడిన అల్పపీడనం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. గత పది రోజుల్లో రెండు తుఫాన్లు విరుచుకుపడ్డాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితులు కారణంగా కురుస్తున్న వర్షాలతో చలితీవ్రత పెరిగిపోయింది. గురువారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన శాస్త్రవేత్తలు హెచ్చరించారు. దీంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది.

తప్పని ఇబ్బందులు

ఖరీఫ్, రబీ పంటలను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రబీలో వరిచేను కోతలు పూర్తయ్యాయి. కొందరు రైతులు పంట పొలంలోనే వరి కుప్పలు పెట్టారు. మరోవైపు యంత్రాల ద్వారా కోత కోసిన రైతులు ధాన్యం బస్తాలను పొలం గట్లు, సమీపంలోని చెరువు గట్లపై ఉంచారు. వర్షాలు పడటంతో పొలంలో కుప్పలు, ధాన్యం బస్తాలను కాపాడుకునేందుకు రోజంతా పడరాని పాట్లు పడుతున్నారు. నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి.

వర్షాలతో తీవ్రనష్టం



రెండు వారాల వ్యవధిలో రెండు తుఫాన్లు వచ్చాయి. రెండు రోజులుగా వర్షాలు పడుతునే ఉన్నాయి. పంట చేతికి అందివచ్చే సమయంలో వర్షాలు పడటం వలన పంట దిగుబడులు తడవకుండా కాపాడుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. మరో వైపు పెసర, మినుము, రబీ వరి పొలాల్లోనూ వర్షం నీరు చేరింది.

– అశోక్ పాణిగ్రాహి, రైతు, లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట



సరుబుజ్జిలి: బుడ్డివలస వద్ద వర్షం నీటిలో వరికుప్పలు



సారవకోట: సవరబొంతు సమీపంలో పొలాల్లో ఉన్న వరి కుప్పలు



బూర్జ: మదనాపురంలో తడిసిన వరిచేను కుప్పలు